బహుమానం

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

నేను సాయంత్రం ఆఫీసునుంచి వస్తూ నేను ఎదురుగావున్న విశాలమయిన మేడముందు అలవాటుగా ఆగి గోడకి తగిలించివున్న ప్రకటన చదువుతూ నిలబడిపోయాను. ఆ ప్రకటనలో ఇలా ఉంది:

"ది......ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు చిత్రవిచిత్రమయిన వస్తువులు, అందమైన ఫర్నిచరు, అలంకరణ వస్తువులు, గాజుపాత్రలు మొదలుగాగల రకరకాల వస్తువులు వేలం వేయబడును ఈ సదవకాశాన్ని వదులుకోవద్దని మనవి" అంటూ ఇంకా ఏవేవో వస్తువుల జాబితాతో ఆ ప్రకటన నిండి ఉంది.

సహజంగా ఇలాంటి వేలంపాటల్లో పాల్గొనటం అంటే నాకు చాలా సరదా. తరుచుగా ఆ ఆవరణలో జరిగే వేలంపాటల్లో కొన్నా కొనకపోయినా పాల్గొంటూనే ఉంటాను. అప్పుడప్పుడు అందుబాటులో వున్న వస్తువులేవైనా ఉంటే కొంటూ ఉంటానుకూడ. నేను నిత్యం వాడుకునే పాండెన్ పెన్ను, చొక్కా గుండీలు అలా కొన్నవే. ఇలాంటి వేలంపాటలలో కొన్ని వస్తువుల నాణ్యత గురించి సంశయించాల్సిన అవసరం ఉన్నా అప్పుడప్పుడు చాలా మంచి మంచి వస్తువులు అతిచవుకగా లభించే అవకాశాలు కూడా లేకపోలేదు. నేను తొందరపడకుండా నిదానంగానే అక్కడ వ్యవహరిస్తానని చెప్పటానికి నేను కొన్న చిన్నచిన్న వస్తువులే నిదర్శనం. కలవాళ్ళు ఖరీదైన వస్తువులే కొనుక్కుని పోతూంటారు. పుష్పక విమానం వంటి వారి గృహాలు ఎప్పుడూ కొత్త వస్తువులకు చోటుఇస్తూనే ఉంటాయి. గతిలేని కొంపల్లోంచిగాని, చితికిపోయిన సంసారాలలోంచిగాని కొన్ని కొన్ని వస్తువులు అక్కడికి చేరుతూంటాయని నాకు తెలిసినా అప్పుడంతగా పట్టించుకోలేదు. ఈ విషయం బయటపెట్టటానికి ఇప్పుడు సిగ్గుపడుతున్నాను. పదిసంవత్సరాల నుంచీ ఈ మేడలో జరిగే వేలంపాటతో నాకు పరిచయం ఉన్నా నిన్న జరిగిన సంఘటనతో ఇకమీదట ఇక్కడికి చేరకూడదనే నిర్ణయానికి వచ్చేసాను. జీవితానికంతా సరిపోయే ఆ ఒక్క అనుభవం నాకుచాలు!

ఇప్పుడా ప్రకటన అలవాటు కొద్దీ గబగబా చదివినా ఈ ఆకర్షణకు మనసులోనే నవ్వుకుని మీద చినుకులు పడుతున్నట్టుగా తోచి గొడుగు తెరచుకుని ముందుకు అడుగు వేశాను.

అసలు జరిగిందిది:

అరుణ కొత్తగా కాపరానికి వచ్చిన రోజులు. అంతేకాదు నేను ఉద్యోగంలో చేరి కొత్త రొమ్ము విరుచుకుని గర్వంగా తిరిగే రోజులుకూడా అవే. అమ్మ నెల్లాళ్ళు వండిపెట్టి అరుణకు కొత్త అలవాటు పడింతర్వాత వెళ్ళిపోయింది. 'పెందరాళే ఇంటికిరండి' అని అరుణ మెల్లగా వీధి గుమ్మంలో నిలబడి అంటే మతిపోయినట్టు అనిపించి ఆఫీసుకి శెలవుపెట్టేద్దామా అనిపించేది ఇలాంటి రోజుల్లో అరుణకి ఏదైనా ఒక చక్కని బహుమానం తెచ్చి ఇవ్వాలని ఒకనాడు అనుకోవడం జరిగింది. నా కోరిక ఆమె ముందు ఉంచాను. ఆమె తృప్తిగా నవ్వుతూనే 'ఆ వస్తువు ఇద్దరికీ ఉపయోగించేదిగా ఉండాలి' అని షరతు పెట్టింది.

"పోనీ ఆ వస్తువేదో చెప్పరాదూ?" అన్నాను.

"అలా కాదు. మీకు తోచింది తీసుకురండి" అంది అరుణ.

ఆ తర్వాత మనసుకు నచ్చిన బహుమతికోసం వీలుచిక్కినప్పుడల్లా గాలిస్తూనే ఉండేవాణ్ని. ఆ చిన్న ఇల్లాలు కూడా తొందర చేసేదికాదు. మధ్య మధ్య ఆ భావం స్ఫురించేట్టుగా నవ్వుతూండేది. ఆ ఉత్సాహం ఆఫీసు పని రద్దీలో వెనకపడుతూ వచ్చింది.

ఒకనాడు పక్క గుమాస్తాకీ నాకూ జరిగిన సంభాషణలో నాలో విషాదంలాంటి బాధ గుండెల్ని అలుముకుని ఏమైనాసరే మాయీ తారుణ్యపు తొలిరోజులకు చిహ్నంగా ఒక వస్తువు ఆమెకు నేను బహూకరించక

తప్పదు. 'అని గట్టిగా అనుకున్నాను.' ఏముంది భాయీ కొత్తగా పెళ్ళాం కాపరానికి వస్తే నాలుగు రోజులు కులుకుతాం. అయిదో నాటినుంచీ తగాయిదాలు, కయ్యాలు, ఆవిడిపుట్టింటికి పోతానని బెదిరించటం, మనం మొగతనం చెలాయించటం, వాళ్లు పస్తుపడుకోవటాలు, పిల్లల్ని కనటం, మనదరిద్రం వాళ్లకి పంచిపెట్టటం. ఇదేకదూ భాయీజీవితం! అన్నపక్క గుమాస్తా మాటల్లోని యథార్థత నన్ను చాలా ఆందోళన పరిచింది. ఆనాడు ఇంటికి వస్తూ స్టేషనుముందు మేడలో వేలంపాట ప్రకటన చూస్తాను. అందులో చిత్రవిచిత్రములైన వస్తువులున్న ప్రకటనచూసి ఆ మర్నాడు ఆ వేలం పాటలో పాల్గొన్నాను.

నేను లోపలికి ప్రవేశించేసరికి జనం కిటకిటలాడుతున్నారు. జనాన్ని ఒత్తిగించుకొని ముందుకు వెళ్ళి నిలబడ్డాను. రకరకాల వస్తువులు అనేక కోణాల్లోంచి కళ్ళముందు మెరిసి అమ్ముడు పోతున్నాయి. పాటగాని గొంతునరాలు చెమటతో మెరుస్తున్నాయి. జనాన్ని ఆకర్షించగలిగే అతనిగొంతు నిర్విరామంగా మోగుతూనే ఉంది చిన్నచిన్న దువ్వెనల దగ్గర్నించి వందల ఖరీదు చేసే వస్తువుల వరకూ అమ్ముడు పోతూనే ఉన్నాయి. నాకు మనసుకు నచ్చిన వస్తువు ఒక్కటీ రాలేదు. కాళ్లుతీపులు పుడుతున్నాయి. ఇకపోదామా అనిపించి కదలబోతుంటే 'ఇదిగిదిగో ఇదిగోనండోయ్' అన్నపాటగాని గొంతువిని ఆగిపోయాను.

అది రెండు ఫోటోలు పెట్టుకొందుకు వీలయిన ఫోటోస్టాండు. ముందుకువెళ్ళి 'ఆవస్తువు చూస్తాను. ఇస్తారా' అన్నాను.

అతను అందించాడు. 'మంచి గంధపుచెక్కతో తయారుచేసింది సార్. దానిశిల్ప నైపుణ్యం చూడండి. ఇది తప్పకుండా కొనవలసిన వస్తువుసార్. మీబోటి వారి ఇంట్లో ఉండతగింది' అంటూ చెప్పుకు పోతున్నాడు.

పక్కనున్నాయన నామీదకు ఒరిగి 'చాలా బాగుందండి' అన్నాడు.

'నిజంగా ఆవస్తువు చాలా అందమయింది.' అని నాకు అనిపించింది.

'దుమ్ముపట్టి దాని అందం తెలియటంలేదు సార్. గరుకుకాగితంతో ఓమారు రుద్దితే దాని అందం బయట పడుతుంది.'

ఆ వస్తువుమీద నా మోజు అధికమయింది. పాట మొదలయింది. రూపాయితో ఆరంభమయి పదిహేను రూపాయలదాకా త్వరత్వరగా పాకింది. అక్కడితో చాలామంది తప్పుకొన్నారు. నేనూ వదిలిపెట్టలేదు. పట్టుదల పెరిగింది. 'పదిహేడు' అన్నాను.

నా పక్కాయన 'ఇరవై' అన్నాడు నావైపు ఓరగా చూస్తూను.

'ఇరవైఅయిదు' అనేశాను తెగించి.

నా పక్కాయన తగ్గిపోయాడు. ఆయ కోపంగా నావైపు ఓచూపు విసిరి అక్కడ్నించి వెళ్ళిపోయాడు. పాట నాకు ఖాయం అయిపోయింది. నేను పదిరూపాయలు తీసి అతనికిచ్చి మిగతా పదిహేను మర్నాడువచ్చి ఇచ్చి వస్తువు తీసుకుపోవటానికి ఏర్పాటు చేసుకుని ఇవతలకి వచ్చేశాను. నాకు పాటలో వళ్ళు తెలియలేదుకాని ఇవతలకివచ్చి గడియారం చూసుకుంటే తొమ్మిదిన్నరయింది.

ఇంటికిచేరి ఇల్లాలి చెవిలో ఈ వార్త వేసేవరకు ఆ ఉత్సాహం నాలో క్షణం క్షణం పెరిగిపోతూనే ఉంది.

"ఏదో అన్నానుగాని అంతఖరీదు పెట్టి దేనికి?" అంది అరుణ.

"నువ్వలా అంటే నా మనసు కష్టపడుతుంది" అన్నాను.

ఆ మాటతోనే ఆమె కంగారుపడిపోయి దగ్గరగావచ్చి చొక్కా గుండీలుపట్టుకుని 'క్షమించండి.' అంది.

భోజనంచేస్తూ మంచిగంధపు చెక్కతో నగిషీలు నగిషీలుగా ముచ్చటైన ఆ శిల్పనైపుణ్యం గురించి నేను వర్ణిస్తుంటే ఆమె తన్మయురాలై వింటూ కూర్చుంది.

అందులో అమర్చటంకోసం ప్రత్యేకంగా రెండు ఫోటోలుకూడా ఆ మర్నాడే తీయించుకోవాలని నిశ్చయించుకున్నాం. ఆమె ముఖంలో భావాలు కనిపెట్టి 'నాకు తెలుసు దేనికి అనవసరపు ఖర్చు అని నీఉద్దేశంకదూ. కాదు...కాదు ఉండాలి ఈ మధురమైన రోజులు...ఒక చిహ్నం'" అంటూ

ఆచీ ఆచి అంటూంటే అడ్డుపడుతూ ఈ మాధుర్యం కలకాలం ఉండేదేగా. ఇక దీనికి చిహ్నాలు దేనికి? ఆ మాట మీరు అంటే కష్టంగాకూడా ఉంటుంది. ఎదుటలేని అనుభవానికి చిహ్నాలుకాని కలకాలం నిలిచే ప్రేమకి చిహ్నాలా?" అంది అరుణ.

పక్క గుమాస్తా అన్నమాటల్లో నాకు పూర్తి విశ్వాసం లేకపోయినా ఎందుకో ఆ మాటలు మర్చిపోలేకుండా ఉన్నాను.

నా మౌనానికి అరుణ "పోనీలెండి. మీకు ఎలా చెయ్యాలని ఉంటే అలాగే చేద్దాం" అంది.

ఆ మర్నాడు ఉదయం నేను పైకం తీసుకుని ఫొటోస్టాండు తెచ్చుకుందుకు వెళ్ళాను. నేనువెళ్ళేసరికి మేనేజరు హాలుమధ్యని కూర్చుని వస్తువులన్నీ గదిలో అందంగా సర్దిస్తున్నాడు నౌకర్ల చేత. నన్ను చూసి గౌరవపూర్వకంగా లేచి నిలబడి నమస్కారం చేసి కూర్చుందుకు కుర్చీ చూపించాడు.

నేను జేబులోంచి పైకంతీసి అతనికివ్వబోతుంటే అతను కుర్చీదగ్గరికి లాక్కుని కూర్చుంటూ "ఉండండి. ఒక్క పదినిముషాలు ఆగితే ఆ పుస్తకాలు, అవీ గుమాస్తా తెస్తాడు. అర్జంటుగా వెళ్ళిపోవాలా?" అన్నాడు.

అంత తొందరలేదన్నట్టుగా తలఊపాను.

నౌకర్లు వస్తువులు భద్రంగా అమరుస్తూనే ఉన్నారు. మేనేజరు చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకుని 'మీరు కొన్నారు చూశారూ ఫొటోస్టాండు అ వారిది' అని గుమ్మంవార నిలబడివున్న ఒక స్త్రీని చూపించాడు. ఆమె కుచ్చెళ్ళమధ్యని ఓ చిన్న కుర్రవాడు నిలబడి వున్నాడు. ఆమెకు సుమారు ఇరవై మూడు సంవత్సరాలు వుండవచ్చు.

మేనేజరు గొంతు తగ్గించి "డబ్బుకోసం వచ్చింది పాపం. ఆమెది ఓ పెద్దగాథ. అయినవాళ్ళందరికీ దూరమై నమ్ముకున్న ప్రియుడుతో ఇంతదూరం వచ్చి కలో గంజో తాగి బ్రతుకుతుంటే దేముడు ఆమెకు పసుపుకుంకుమ లేకుండా చేసేశాడు. ఆడబిడ్డ కష్టాలు పడుతూంది" అని అతను ఫొటోస్టాండు తీసుకువచ్చి ఒకచోట వేలుపెట్టి చూపిస్తూ 'చదవండి' అన్నాడు.

నేను దుమ్ముదులిపి 'ప్రేమ బహుమానం' అని కిందపేరు పోల్చుకోలేక తడబడుతూంటే 'అతని పేరులెండి. ఆమెకీ అతనికీ ఉన్న అనుబంధం ఎంత గాఢమయినదో, పవిత్రమయినదో చూశారా. అతను ప్రేమగా సమర్పించిన ఈ బహుమతికూడా అమ్ముకునే స్థితిలో ఉంది పాపం. అయినవాళ్ళు వెలేశారు. ఎవరాదరించగలరు" అంటూ నిట్టూర్చాడు.

ఆమె తలవంచుకుని కుర్రవాణ్ని దగ్గరగా తీసుకొని అక్కడే నిలబడివుంది.

నౌకర్లు చేసే పెద్ద పెద్ద ధ్వనుల్లో మా మాటలు రెండోవారికి వినిపించే అవకాశం లేదు.

"మరి ముందు జీవితం?"

రెండుచేతులూ పైకెత్తి ఆకాశంవైపు చూపిస్తూ 'భగవంతుడి ఇచ్ఛ' అన్నాడు మేనేజరు అర్ధనిమీలిత నేత్రాలతో.

గుమాస్తా పుస్తకాలు పట్టుకుని వచ్చి డబ్బు పుచ్చుకుని రసీదు రాసి నాకిచ్చాడు. మేనేజరు ఫొటోస్టాండు నాచేతిలో పెడుతూ "సంచీలో పెట్టుకోండి. ఆమె చూస్తే బాధపడుతుంది" అని కదలబోతుంటే నేను మరో పదిరూపాయలు అదనముగా ఇస్తూ 'ఇది దానం అన్నవిషయం ఆమెకు చెప్పకండి' అన్నాను.

అతను ఆ సొమ్ము ఆమెచేతిలో వెయ్యటం—ఆమె లెక్క చూసుకుని డబ్బు ముట్టినట్టుగా వేలుముద్దర వేసి పిల్లవాణ్ని చంకనెత్తుకుని బరువుగా వెళ్ళిపోవటం ఈనాటికీ నా కళ్ళముందు మెదుల్తూనే ఉంటుంది. ఆ కుర్రవాని తప్పటడుగులు నా హృదయంలో కదుల్తూనే ఉంటాయి. ఆమె దైన్యమైన జీవితం మనసులో చెరగని ముద్రవేసి ఎన్ని సంవత్సరాల నుంచో పరిచయమున్నట్లుగా నిలిచిపోయింది.

నేను ఈ గాథంతా అరుణకి చెప్పలేదు. ఆమె సున్నితమైన మనస్సు గాయపర్చటం యిష్టము లేక కొన్ని అబద్ధాలుకూడా ఆడాను.

ఆమె ఆ వస్తువు అందానికి ముగ్ధురాలవుతూ 'ఎంత బాగుందండి. అయితే ఇక్కడ ప్రేమ బహుమానం అని రాసి ఉందేమిటి?' అంది.

కంగారు కప్పిపుచ్చుకుంటూ 'అవును ప్రేమ బహుమానం కాదూ? నేనే చెక్కించాను' అన్నాను.

'కింద ఇంకో పేరు ఏదో ఉన్నదే' అని ఆమె దాన్ని పరీక్షించబోతుంటె ఆమె చేతిలోంచి ఆ వస్తువు లాక్కుని 'అదా? అక్కడ కొద్దిగా ముక్క

పోయిందిలే...అంతే. అంతకు తప్పించి మరేమీలేదు" అని సర్ది చెప్పాను.

గరుకు కాగితం తెచ్చి ఆ వస్తువుని శుభ్రం చేసాను. మర్నాడు అనుకొన్నట్టుగా విడివిడిగా ఇద్దరం ఫోటోలు తీయించుకున్నాం. ఆ రెండు ఫోటోలు ఆ స్టాండులో అమర్చాం: ఆ రోజల్లా దానివైపే చూస్తూ కూర్చున్నాం. రకరకాలుగా ఆలోచించాం. మా ఆలోచన్లు ఎంతవరకూ పోయినాయంటే ఆ స్టాండుయొక్క అందం ద్విగుణీకృతం కావటంకోసం పక్కన ఒక ఖరీదైన రేడియో కూడా అవసరం అన్నంత వరకూ పోయాయి. అరుణ నవ్వేసి బాగుందండి. నాడా దొరికిందని గుర్రం కొనాలనుకున్నాట్ట ఒకతను. అలాగుంది మీరు చెప్పేది' అంది.

నాకు అభిమానం వేసింది. 'అయితే ఆపాటి స్తోమతు లేదనా నీ అభిప్రాయం' అన్నాను పౌరుషంగా నే.

'అది కాదండీ లేదని ఎవరన్నారు? అసలు మన ధోరణి చెబుతున్నాను" అంది అరుణ అనునయించే ధోరణిలో.

అరుణకు ఆ వస్తువు రానురాను ఎంత ప్రీతి పాత్రమయిందంటే ఒకనాడు అది టేబిల్ మీంచి జారి కిందపడితే ఆమె కన్నీరు ఆపుకోలేకపోయింది. 'ఎంత తప్పు చేశాను'అన్నట్టుగా బాధగా నావైపు చూసింది.

ఇలా రోజులు వెళ్ళిపోతున్నాయి.

అరుణ తొలిపంటగా పండులాంటి పిల్లవాణ్ని పొత్తిళ్ళలో వేసుకుని గడపతొక్కింది. అనుకున్న వ్యవధికంటె ముందే వచ్చేసింది కూడా, అత్తగారు కూడా వచ్చారు.

నేను ఎదురుగా వెళ్ళి పిల్లవాణ్ని అందుకోవటానికి సిగ్గుపడ్డాను. అరుణ నా కళ్ళల్లోకి చూడటానికే సిగ్గుపడిపోయింది.

అత్తగారు గలగలా జలపాతంలా మాట్లాడే మనిషి! ఆవిడ ధోరణి వినటానికి విసుగ్గానే ఉంటుంది. రెండు మాసాలు కూతురికి సహాయంగా ఉండి ఆవిడ వెళ్ళిపోయింది.

అరుణా, నేనూ, పిల్లాడూ మిగిలాం. అరుణకి ఎంతసేపూ వాడితో సరిపోయేది.

ఏం కాలం వచ్చిపడిందమ్మా పిల్లాడికిపోతపాలా? ఈ ఆడబిడ్డల బలాలు అలా ఉన్నాయి" అంటూ దవడలు నొక్కుకుంది పనిమనిషి.

ఆమె ఆశ్చర్యంలో బేసబబు ఏమీలేదు. ప్రతి నెలా పది పన్నెండు రూపాయలు వాడిక్రింద ఖర్చు.

వాడికి కాస్త లేచినిలబడటం ఏదైనా ఆసరా ఉంటే నాలుగడుగులు వెయ్యటం వచ్చేసరికి అరుణ అన్నం సయించటంలేదనీ, ఒంట్లో బాగా ఉండటం లేదనీ, వాంతులు వెళ్ళుతున్నాయనీ బద్ధకంగా అస్వస్థతలు మొదలు పెట్టింది.

పనిమనిషి జోస్యం చెప్పింది. అయిదురూపాయలు పుచ్చుకున్న డాక్టరూ ఆమాటే చెప్పింది. నామటుకు నాకు "మళ్ళీనా?" అనిపించింది.

అరుణ ఈమారు ఆడపిల్లని కన్నది. సంవత్సరానికి ఆరుమాసాలు హోటలుతిండి తినడంతో సగం అయిపోయాను. ప్రాణాలు కళ్ళల్లో పెట్టుకుని అరుణకి స్వాగతం చెప్పాను.

మూడోమారు అరుణే సిగ్గుపడింది. "బాగుందండీ, తొలిసారీ మలిసారీ ముద్దుగా ఉంటుందిగాని ఏటా పుట్టింటికిపోవటానికి అభిమానంగా ఉంటుంది. ఇక్కడే హాస్పిటల్లో పోసుకుంటాను. అంతగా కావలిస్తే ఆ పది రోజులూ అమ్మవచ్చి చేసిపెడుతుంది" అంది.

అరుణ గండం తప్పి బయటపడింది. కడుపులోనే బిడ్డ చనిపోయింది. పెద్ద ప్రాణం దక్కినదని తృప్తి పడ్డాను. అరుణకి పెద్దజబ్బే చేసింది. ఖర్చు సంగతి సరేసరి.

పదిరోజులుండటానికి వచ్చినఅత్తగారు నెల్లాళ్ళ వరకూ కదిలేఆస్కారం లేకపోయింది. అరుణ కాస్త ఓపిక చేసుకొని నా సహాయంతో రోజులు నెట్టుకొస్తుంది. పిల్లలు బరువైపోయారు. వాళ్ళని సమర్థించుకోలేక అరుణ నలిగిపోయేది.

జీవితం అసిధారావ్రతంలాగుంది.

అరుణ రక్తమంతా హరించిపోయి తెల్లగా పాలిపోయింది.

ఓపిక లేదు. ఆఫీసులో పని రద్దీ ఎక్కువగానే ఉంది. మనసులో గుబులుగుబులుగా, తిక్కగా ఉంటుంది.

మా ఫోటోస్టాండు సంగతి అప్పుడు మా యిద్దరి లోనూ ఎవరికీ పట్టలేదు. పనిమనిషే అప్పుడప్పుడు దాన్ని శుభ్రం చేస్తూ ఉండేది. "అప్పటికీ ఇప్పటికీ అసలు పోలికే లేదు. ఎంత చిక్కిపోయారు!" అంటూ ఆశ్చర్యం ప్రకటిస్తూ ఉండేది.

"నీపని నువ్వు చూసుకో. అనవసరపు ప్రసంగం" అని అరుణ విసుక్కునేది.

ఆస్టాండు చేతిలోకి తీసుకొని కాసేపు తదేకధ్యానంగా చూసి మళ్ళీ అక్కడపెట్టేసి ప్రేమ బహుమానం అని అస్పష్టంగా అనుకొన్నాను మనసులో.

ఒకనాడు ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికి అరుణ ఉన్నట్టుండి కొంప మునిగిపోయినట్టుగా 'ఇక ఈ ఇంట్లో ఒక్క నిముషం వుండటానికి వీల్లేదండీ మరో ఇల్లు చూసుకుందాం' అంది.

నేను ఆశ్చర్యర్యంగానే ఏమిటి కారణం? అన్నాను.

గొంతు తగ్గించి 'ఈ పక్క డాబా ఉంది చూడండి. అందులోకి ఓ పరువులేని ఆడది చేరింది. ఇలాంటి పొరుగున ఉండకూడదు.'

ఆమె ఊహించినంత అసహ్యం నా ముఖంలో ద్యోతకం కాకపోవటంతో అరుణ ముఖమంత చేసుకుని 'ఏం మొగవారండీ! ఏదో సామాన్యమయిన విషయంలా చూస్తారేం. చేతనయితే వీధిలో వాళ్ళంతా కలిసి ఆదులటని, ఆ నీతిలేనిదాన్ని అక్కణ్నించి వెళ్ళగొట్టండి, లేదంటారా మనమయినా యిక్కడ్నించి ఖాళీ చేసిపోదాం.' అంది.

'ఇంతకీ ఆమెను నేను చూడలేదు. ఆమె గురించి నేను వినలేదు. నాకంటె ముందు నీకెలా తెలిసింది.'

'పనిమనిషి చెప్పిందండి. నేనూ కనిపెట్టాను' అంది అరుణ నెత్తి మొత్తుకుని.

నేను ఆమెను రిక్షాలోంచి దిగుతుండగా చూసి ఆశ్చర్యపోయాను. ఆనాడు చిన్నపిల్లవాణ్ని పక్కన పెట్టుకుని గుమ్మంవార ఒదిగి డబ్బుకోసం నిలబడ్డ స్త్రీ మూర్తి కంటిముందు మెదిలితే నిశ్చేష్టుణ్నయి చూస్తూ నిలబడిపోయాను.

అరుణ గుమ్మంలో నిలబడి "ఆమె అందానికి ముగ్ధులయి పోతున్నారా?" అంది.

తెప్పిరిలి ఈ కఠినమయిన ధోరణికి కోపం వచ్చినా తమాయించుకుని 'మాటలు జాగ్రత్తగా ప్రయోగించాలి అరుణా' అన్నాను.

'రెండువీధుల అవతల రెండిళ్ళు ఖాళీగా ఉన్నాయట పోదాం' అంది అరుణ.

అలాగే అని నేను నా గదిలోకిపోయి ఆలోచిస్తూ కూర్చుండిపోయాను. దిక్కులేని దీనురాలు, తనదగ్గర దానం పుచ్చుకున్న అభాగ్యురాలు ఇలా మారిపోయిందే అన్న ఆలోచనతో అలిసి నిద్రపోయాను.

నిద్రలో రూపాయలు గలగలలాడుతూ మీద వర్షిస్తున్నట్లుగా కలవచ్చింది.

అరుణ చెప్పింది. ఆమెపేరు 'రాధ'ట అంతా 'రాధాభాయి' అని పిలుస్తారుట.

నేను అరుణ ఒత్తిడి పడలేక ఇల్లు మార్చేసాను. మంచిపని చేశాను అని నామటుకు నేనూ తృప్తిపడ్డాను.

అరుణ దేముడుగుళ్ళో అమ్మవారికి పూజ చేయించింది.

అయినా ఆమె రాధాభాయిని మర్చిపోలేదు. ముఖం వెగటుగా పెట్టుకుని 'ఏం జీవితం? పాడు బ్రతుకులు! ఆ వెధవ బ్రతుకులు బతిక్కపోతే చావకూడదూ" అంటూ అసహ్యించుకుంటూనే ఉండేది.

పనిమనిషి రాధాబాయిని గురించి ఒద్దన్నా ఏదో ఒకటి చెబుతూ ఉంటుందని అరుణ దాన్ని కూడా మానిపించేసి కొత్త పనిమనిషిని కుదుర్చుకొంది.

కొత్తయింట్లో అరుణ ఫోటోస్టాండుని టేబిల్ మీద అమరుస్తూంటే నాకు మనసులో అదోరకంగా అనిపించింది. పశుప్రవృత్తిచేసుకునే ఆడదాని వస్తువు సంసారుల ఇళ్ళల్లో వాడుకోవటమా అనిపించి సరిపడక "ఆస్టాండు తీసెయ్యి అరుణా" అన్నాను.

అరుణ ఆశ్చర్యంగా ఏం? అంది.

"అదేం బాగులేదు. ఇంకోటి మంచిది తెస్తానుగా" అన్నాను. అరుణ అనుమానంగా" ఏదో కారణం ఉంది. చెప్పండి" అంటూ రొక్కించ సాగింది.

"ఏమీలేదు ఊరికేనే"

"అయితే ఫర్వాలేదు నాకు చాలా బాగుంది, అది బాగులేదంటే ఎవరైనా నవ్వుతారు."

"అదికాదులే చెప్పినట్టు చెయ్యి దాన్ని పెట్లో పడెయ్యి" అన్నాను విసుగ్గా.

'ఎందుకో చెప్పండి బాగులేకపోవటం ఒక్కటే కారణం అంటే నమ్మలేను.' అంది అరుణ దగ్గరగా వచ్చి.

నేను వెనక్కు తిరిగి కిటికీ గజాలుపట్టుకుని' ఆ వస్తువు రాధాభాయిది' అన్నాను.

'హా!' అన్న ఒక్కముక్క తప్పించి ఆమె నోటమాట రాలేదు. అరుణ ఎర్రబడిన ముఖంతో 'ఆ రహస్యం ఇన్నాళ్ళుగా ఎందుకు దాచారు' అంది.

'నేనేకాదు నువ్వూ ఇవ్వాలివరకూ దాని సంగతే పట్టించుకోలేదు. ఇవాళ ఆవస్తువు ప్రత్యేక శ్రద్ధతో ఆ టేబిల్ మీద అమరుస్తుంటె వెగటుగా తోచింది.' అన్నాను.

'ఇప్పటికయినా చెప్పారు నయం' అని అరుణ ఆ ఫ్రేములోంచి రెండుఫోటోలు ఇవతలకి తీసి దాన్ని గదిమూలకు గిరవాటుపెట్టింది. అది వెళ్ళి పాత బటలమూటమీద పడింది. లేకుంటే ముక్క చెక్కలయేది ఆవిసురుకి

నాకు ఓ ఆలోచనతట్టింది. 'ఎలాగూ పనికి రానప్పుడు ఆవస్తువు ఇంట్లో ఉంచటందేనికి? అమ్మేద్దాం...ఎంతోస్తే అంతే' అన్నాను.

'అలాగే చెయ్యండి' అంది అరుణ.

నేను ఆ వస్తువుని తీసుకొని మెట్లు దిగబోతుంటే అస్పష్టంగా తప్పు చేస్తున్నానా అనిపించి "పోనీ ఉంటే ఏం?" అన్నాను.

"మీదంతా జేలతనం అలాంటి వస్తువుల్ని ఇంట్లో పెట్టుకొంటామా?" అంది అరుణ.

"కాదు మన తొలినాటి..."

అడ్డుపడుతూ అరుణ "అక్కరేదు, మన ప్రేమకి చిహ్నాలు ఈపసిపిల్లలు లేరూ? ఇలాంటి పాపిష్ఠివస్తువులు మనకి వద్దు" అంది.

నేను వేలంపాట మేనేజర్ని కలుసుకుని సంగతి చెప్పాను.

అతను ఆశ్చర్యం ప్రకటిస్తూ, "ఇంత మంచి వస్తువు దేనికిసార్ అమ్మటం?" అన్నాడు.

"కాదు మేనేజరుగారూ. అమ్మేసెయ్యండి విషయం మీకే తెలుస్తుంది" అన్నాను.

ఆయన వస్తువు తీసుకుని 'సరే' అని నిట్టూర్చాడు.

నేను లేచి "మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు?" అన్నాను.

"రేపు ఆదివారంనాడే పాట పెడతాం. సోమవారం రండి. వీలుంటే రేపే రావచ్చు,"

నేను ఇవతలకి వచ్చేశాను. హృదయం తేలికపడింది. అరుణ మాటలు జ్ఞాపకం వచ్చాయి అరుణ చెప్పింది నిజం!

ఆదివారంనాడే నేనూ వేలంపాటకు వెళ్ళాను. దూరంగా నిలబడ్డాను. ఆ పూట వాన బాగా కురిసి ముసురుగా ఉందని కాబోలు జనం అంతగా రాలేదు. పాట మొదలయింది.

నా ఫోటో స్టాండుకూడా పాటకి వచ్చింది.

నాగుండెలు ఎందుకో దడదడమన్నాయి.

ఇదిగివండో ఇదుగో సండోయ్! అన్న కంఠం నా చెవుల్లో మార్మోగింది.

ఆ గొడవలో ఎవరు పాడారు, ఎంతకి పాడారు నాకు వినిపించలేదు. పాటగాడు మరోవస్తువు అందుకున్నాడు.

జనాన్ని తప్పించుకొంటూ నెత్తిన ముసుగు వేసుకున్న ఓ స్త్రీ నా ఫోటోస్టాండుని హృదయానికి దగ్గరగా హత్తుకొని ఇవతలికి రావటం చూసాను. ఆమె వీధిదీపం వారనిలబడి 'రిక్షా' అంటూ పిలిచింది.

ఆమె నెత్తిమీద ఉన్న ముసుగు వెనక్కి జారిపోయింది. దీపం వెలుగులో ఆమెను గుర్తుపట్టాను.

ఆమె రాధాభాయి!!

నిన్న జరిగిన సంఘటన ఇది,

రాత్రి అరుణ 'ఏమిటో ఈ జీవితాలు...ఒక మొగవాడు, ఒక ఆడది ఒకచోట చేరటం—పిల్లలూ...బాధలూ...ఏమిటీ బ్రతుకులు! రానురాను మనమీద మనకే అసహ్యం పుడుతోంది' అంది కన్నీటితో. నేను చప్పునవారిస్తూ 'అలా అనకు అరుణా మనజీవితం విలువ మనకి తెలియదు...ఆ విలువ తెలిసినవారు వేరే ఉన్నారు.' అన్నాను.